సాక్షి
వికారాబాద్
సోమవారం ¦ 5 ¦ ఫిబ్రవరి ¦ 2024



‘ఆగ్రోస్’పై అలసత్వం!

ఆగ్రోస్ సెంటర్లు బీఆర్ఎస్ హయాంలో కనుమరుగయ్యాయి. వాటిని ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు. 8లో▸



‘ఆయన’ వెనుకడుగే!

కుటుంబ నియంత్రణ చికిత్సలు ఆడవాళ్లకే పరిమితమవుతున్నాయి. పురుషులు ఈ చికిత్సకు వెనుకడుగు వేస్తున్నారు. 8లో▸



సీసీఐ కేంద్రాన్ని తెరవండి

ఐదు రోజుల నుంచి సీసీఐలో పత్తి కొనుగోలు కేంద్రాలు నిలిచిపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. 9లో▸

ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి

- శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్
- మహాసభ జిల్లా అధ్యక్షుడిగా శివకుమార్ గుప్తా ప్రమాణ స్వీకారం



స్పీకర్, జెడ్పీ చైర్‌పర్సన్‌కు జ్ఞాపికలు అందజేసి సన్మానిస్తున్న ఆర్యవైశ్యులు

కొడంగల్: రాష్ట్రంలో ఆర్యవైశ్యుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని రాఘవేంద్ర గార్డెన్స్‌లో ఆర్యవైశ్య జిల్లా మహాసభ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం పెద్ద ఎత్తున నిర్వహించారు. జిల్లా ఆర్యవైశ్య మహాసభ, మహిళా సంఘం, యువజన సంఘం, వాసవి సేవాదళ్, నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, డివిజన్ స్థాయి ఇన్‌చార్జిలు, సలహాదారులుగా సుమారు 200 మంది వరకు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, జెడ్పీచైర్‌పర్సన్ సునీత, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, కొడంగల్ మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. జిల్లా మహాసభ నూతన అధ్యక్షుడిగా కటుకం శివకుమార్ గుప్తా, ప్రధాన కార్యదర్శిగా మాలె లక్ష్మణ్‌గుప్తా, కోశాధికారిగా ఆకారపు రాజు గుప్తా, అదనపు కార్యదర్శిగా వీరేందర్‌గుప్తా తదితరులతో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి అర్థం లక్ష్మయ్య రాష్ట్ర ఎన్నికల అధికారిగా వ్యవహరించి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఆర్యవైశ్యులు రాజకీయంగా సామాజికంగా ఆర్థికంగా అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధించాలన్నారు. సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరూ సమయం కేటాయించి తగిన సలహాలు సూచనలు ఇవ్వాలన్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు. సభకు హాజరైన ప్రజాప్రతినిధులను ఆర్యవైశ్య సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల, తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న, కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు నందారం ప్రశాంత్, ఆర్యవైశ్య సంఘం నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అనుబంధ సంఘాల బాధ్యులు

మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా యాస్కి శిరీషా, ప్రధాన కార్యదర్శిగా సరాపు శైలజ, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడిగా రమేశ్ కుమార్ గుప్తా, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్ గుప్తా, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడిగా నరేష్‌కుమార్ గుప్తా, ప్రధాన కార్యదర్శిగా హరీష్‌కుమార్ గుప్తా ప్రమాణం చేశారు.



మహాసభ జిల్లా అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేస్తున్న శివకుమార్ గుప్తా

న్యూస్‌రీల్

నేటి నుంచి ‘పల్లెకు పోదాం’

బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి



పల్లెకు పోదాం కార్యక్రమం కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

వికారాబాద్ అర్బన్: భారతీయ జనతా పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పల్లెకు పోదాం కార్యక్రమం జిల్లాలో సోమవారం నుంచి ఈ నెల 8 వరకు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.మాధవరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన తన కార్యాలయంలో కార్యక్రమాన్ని సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాధవరెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలోని నాయకులంతా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ప్రధాని చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివరాజ్, ప్రధాన కార్యదర్శి పాండు గౌడ్, కేపీ రాజు, నరోత్తం రెడ్డి, వివేకానంద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయవాదం ప్రబలుతోంది



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ లక్ష్మణ్ తదితరులు

రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్

పరిగి: సమాజంలో అన్ని కులాలు సంఘర్షణ లేకుండా సమన్వయ దృక్పథంతో బతికినప్పుడే దేశం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని రాజ్యసభ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. ఆదివారం హైదరాబాద్ నగరంలోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పరిగి పట్టణానికి చెందిన డాక్టర్ భాస్కరయోగి రచించిన సమస్త సాధనలో సౌజన్యమూర్తులు అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కులాలకు అతీతంగా దేశంలో జాతీయవాదం బలంగా ప్రబలుతోందన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ అన్ని కులాలను సమానంగా చూస్తూ సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. అదే దృక్పథంతోనే మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని డాక్టర్ భాస్కరయోగి పుస్తకాలను రాస్తున్నారని కొనియాడారు. మరిన్ని పుస్తకాలను రాస్తూ యువతకు మంచి సందేశాన్ని అందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సామాజిక కన్వీనర్ అప్పల ప్రసాద్, నేషనలిస్ట్ హబ్‌సాయి, ఆలే భాస్కర్, దివాకర్, కృపాకర్, మురళి మనోహర్, ప్రజా ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో సత్తా చాటిన విద్యార్థి

మోమిన్‌పేట: సాంఘిక శాస్త్రంలో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్‌లో మండల పరిధిలోని మేకవనంపల్లి జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన పదోతరగతి విద్యార్థిని కె.నీతిక మొదటి స్థానంలో నిలిచింది. ఆదివారం పాఠశాల హెచ్ఎం గౌరీశంకర్ మాట్లాడుతూ.. మండల, జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలవడంతో పాఠశాలకు మంచి పేరు వచ్చిందన్నారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు అరుణ్‌కుమార్ చొరవతో ఆమె రాష్ట్ర స్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షించారు.

క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం

ఇబ్రహీంపట్నం: క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం అవుతుందని, పని ఒత్తిడి తగ్గి ఉపశమనం పొందుతారని రాష్ట్ర రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) అధ్యక్షుడు వంగ రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.గౌతమ్ అన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా రెవెన్యూ స్పోర్ట్స్ మీట్‌ను మండల పరిధిలోని చర్లపటేల్‌గూడ గ్రామ సమీపంలోని ఎస్ఎస్‌జీ క్రికెట్ మైదానంలో ఆదివారం నిర్వహించారు. వికారాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల నుంచి రెవెన్యూ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై వివిధ క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు బహుమతుల ప్రదానం కార్యక్రమానికి హాజరైన వారు మాట్లాడుతూ.. క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంచుతాయని, మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని అన్నారు. క్రికెట్‌లో విజేతగా నిలిచిన రంగారెడ్డి జిల్లా జట్టు కెప్టెన్ రామకృష్ణ బృందానికి ట్రోఫీని, మేడ్చల్ జిల్లా కెప్టెన్ సంతోష్ బృందానికి రన్నరప్ ట్రోఫీని అందజేశారు. బ్యాడ్మింటన్, టెన్నీకాయిట్, చెస్, క్యారమ్స్, ఖోఖో, మ్యూజికల్ చైర్ తదితర క్రీడాంశాల్లో విజేతలైన రెవెన్యూ ఉద్యోగులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ట్రెసా రాష్ట్ర ఉపాధ్యక్షులు రాంరెడ్డి, కె.నిరంజన్, ఎండీ అన్వర్, జాయింట్ సెక్రటరీ విజయేందర్, జిల్లా సెక్రెటరీ రామకృష్ణ, సభ్యులు ప్రసన్నలక్ష్మి, నాగజ్యోతి, కిరణ్, రాజేశ్వర్‌రెడ్డి, తారక్, సాగర్, సాయికిరణ్, నిర్వాహకులు పాల్గొన్నారు.

‘పది’లో సత్తా చాటుతాం

- ఉత్తమ ఫలితాలు సాధిస్తాం
- ప్రభుత్వ విద్యార్థులకు అభ్యాస దీపికల సరఫరా
- ప్రత్యేక తరగతుల నిర్వహణ
- నిత్యం విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ
- ‘సాక్షి’తో జిల్లా విద్యాధికారి రేణుక ముఖాముఖి



జిల్లా విద్యాశాఖాధికారి రేణుక

వికారాబాద్: గతం కన్నా మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు టీంవర్క్ చేస్తున్నాం.. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.. విద్యార్థులు జంకు లేకుండా నేర్చుకున్న ది పరీక్షల్లో రాసేలా వారిని సంసిద్ధులను చేస్తున్నాం. వారికి నేర్పించటంతో పాటు నేర్చుకున్న ది పరీక్షల్లో బాగా రాసేలా ప్రిపేర్ చేస్తున్నామని డీఈఓ రేణుక అన్నారు. మార్చి 18 నుంచి పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో జిల్లా విద్యాశాఖ చేస్తున్న కసరత్తు.. ఇందుకు తీసుకుంటున్న చర్యలను ఆమె ‘సాక్షి’కి వివరించారు. 2023 నవంబర్ 10 నుంచే విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

హెచ్ఎంలతో కలెక్టర్ సమావేశం

గతంతో పోలిస్తే మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నాం. కరోనా కంటే ముందు జిల్లా 27వ స్థానంలో ఉండేది.. ఆ తరువాత ఏడాది బాగా కష్టపడటం వల్ల 24వ స్థానానికి చేరుకున్నాం. అయితే గతేడాది ఫలితాలు నిరాశ పరిచాయి. ఉత్తమ ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో ఈ ఏడాది ముందుగానే ప్రత్యేక తరగతులు ప్రారంభించాం. ఇప్పటికే కలెక్టర్ సైతం ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సూచనలు సలహాలు ఇచ్చారు. జిల్లాలో మొత్తం 13,074 మంది పదవ తరగతి విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందులో 10,541 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుతున్నారు. 2,533 మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్నారు.

ఒక్కో రోజు ఇద్దరు ఉపాధ్యాయులు

పదవ తరగతి విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేసే విషయంలో ఈ సారి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. గతేడాది మాదిరిగానే ప్రభుత్వమే స్నాక్స్ కోసం నిధులు సమకూర్చనుంది. ఒంటిపూట బదుల సమయంలోనూ ప్రత్యేక తరగతులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటాం. ఇందుకు ప్రతీ పాఠశాలలో రోజు ఇద్దరు ఉపాధ్యాయులు ఉండి స్పెషల్ తరగతులు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించాం. విద్యార్థులు సులువుగా అర్థం చేసుకునేందుకు వీలుగా అభ్యసన దీపికలు అందజేసింది. ప్రీఫైనల్స్ పక్కాగా నిర్వహిస్తున్నాం.. ఒక రోజు పరీక్ష నిర్వహిస్తూ మరో రోజు విద్యార్థులు రాసిన పేపర్లపైన వారితో ఉపాధ్యాయులు డిస్కర్షన్ చేసేలా ప్లాన్ చేస్తున్నాం. విద్యార్థుల సామర్థ్యాలను బట్టి గ్రూపులుగా విభజించి బోధించేలా చర్యలు తీసుకుంటున్నాం.

వేకప్ కాల్స్ చేస్తున్నాం

విద్యార్థులకు బోధించి.. చదువుకోమని చెప్పి ఊరుకోకుండా వారు నిత్యం చదువుపై దృష్టి సారించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకు ఉదయం 5 గంటలకు విద్యార్థులకు వేకప్ కాల్స్ చేసి నిద్ర లేపుతున్నాం. వారి పేరెంట్స్‌తో మాట్లాడేలా ఉపాధ్యాయులకు బాధ్యతలు అప్పగించాం. ప్రత్యేకంగా 10వ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులను పేరెంట్ టీచర్స్ మీటింగ్స్ ఏర్పాటు చేయిస్తున్నాం. ఎవరైన స్లో లెర్నర్స్, ఇర్రెగ్యులర్స్ ఉంటే మా ఉపాధ్యాయులు వారి ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడుతున్నారు. హెచ్ఎంలు, ఎంఈఓలతో వాట్సప్ గ్రూపులు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా 161 హెచ్ఎం పోస్టులకు గాను 96 పాఠశాలల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 662 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆ స్థానాల్లో కొన్ని చోట్ల సబ్జెక్టు తెలిసిన ఎస్జీటీలతో చెప్పిస్తున్నాం. జిల్లాను ఉన్నతంగా నిలిపించేందుకు సమష్టి కృషి చేస్తున్నాం.

క్లుప్తంగా

సమ్మెకు సహకరించండి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య

బొంరాస్‌పేట: దేశ వ్యాపంగా ఈ నెల 16న కార్మిక సంఘాలు చేపట్టే సమ్మెకు సహకరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య గ్రామ పంచాయతీ సిబ్బందిని కోరారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతు, వ్యవసాయ కూలీలకు వ్యతిరేకంగా అనుసరిస్తున్న విధానాలను ఖండిస్తున్నామన్నారు. దీనికి పలు కార్మిక సంక్షేమ సంఘాలు సంయుక్తంగా దేశ వ్యాప్తంగా సమ్మెను చేపట్టాయని నిర్ణయించాయన్నారు. గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ)లోని కార్మికులందరూ పాల్గొనాలని తెలిపారు.

బెట్టింగ్ ఆడుతున్న ఐదుగురిపై కేసు నమోదు

తాండూరు టౌన్: నిషేధిత ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడుతున్న ఐదుగురు వ్యక్తులపై తాండూరు పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణ సీఐ సంతోష్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని యాదిరెడ్డి చౌక్ వద్ద శనివారం రాత్రి ఆంజనేయులు, ఖాజా, వేంకటేశ్వర్లు, శ్రీనివాస్, ఖదీర్‌లు మొబైల్‌లో ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతుండగా పోలీసులు దాడి చేసి వారి వద్ద ఐదు ఫోన్లు, రూ.25,990 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అనుమానాస్పదంగా పంచాయతీ కార్మికుడి మృతి



బాల కృష్ణయ్య మృతదేహం

షాబాద్: అపస్మారక స్థితిలోకి వెళ్లిన గ్రామ పంచాయతీ కార్మికుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బోడంపాడు గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బోడంపాడు గ్రామానికి చెందిన బాలకృష్ణయ్య(53) గ్రామ పంచాయతీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. శనివారం ఉదయం సర్దార్‌నగర్‌లో బ్యాంక్ పని ఉందని గ్రామానికి చెందిన కొత్పల్లి నర్సింలతో కలిసి వెళ్లాడు. అక్కడ పని ముగించుకొని వచ్చే దారిలో మద్యం తాగి సాయంత్రం ఇంటికి వచ్చాడు. ఇంట్లోనే విశ్రాంతి తీసుకున్నాడు. సాయంత్రం అతని కుమారుడు శివ చూడగా పడుకున్న చోటనే వాంతులు చేసుకొని అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. వెంటనే ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

‘ఆగ్రోస్’పై అలసత్వం

- విత్తనాలు, ఎరువులకు అవస్థలు పడుతున్న రైతులు
- మార్కెట్లో అధిక ధరలకు విక్రయిస్తున్న వైనం
- కేంద్రాలు ప్రారంభించాలని అభ్యర్థనలు

ఆరుగాలం శ్రమించిన అన్నదాతలకు ఆసరాగా నిలవాలనే ఉద్దేశంతో ఉమ్మడి రాష్ట్రంలో ఆగ్రోస్ కేంద్రాలకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం ఆ సెంటర్లు మూతబడి రైతులకు నానా ఇబ్బందులు సృష్టిస్తున్నాయి. విత్తనాలు, ఎరువులు అధిక ధరలకు విక్రయించి సాగు చేయాల్సిన పరిస్థితి దాపురించింది.



పెద్దేముల్ మండల కేంద్రంలో మూతబడిన ఆగ్రోస్ కేంద్రం

పెద్దేముల్: ఉమ్మడి రాష్ట్రంలో ఏర్పాటు చేసిన ఆగ్రోస్ సెంటర్లు బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో కనుమరుగై పోయాయి. మళ్లీ వాటిని ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో సమయానికి విత్తనాలు, ఎరువులు అందక నానా ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. మార్కెట్లో ఎరువులు, క్రిమి సంహారక మందులు అధిక ధరలకు విక్రయిస్తున్నామని, అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని పెద్దేముల్, నాగులపల్లి, జనగాం, మారేపల్లి, రుద్రారం, తింఆసన్‌పల్లి, గాజీపూర్, బుద్దారం గ్రామాల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో మండల కేంద్రంలో ఆగ్రోస్ కేంద్రం ఏర్పాటు చేసి విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాలను సబ్సిడీపై అందజేశారు. కానీ, గత ప్రభుత్వంలో ఆగ్రోస్ కేంద్రం జాడ లేకుండా పోయింది.

వ్యవసాయమే జీవనాధారం

మండలంలోని 30 రెవెన్యూ గ్రామాల్లో 25 వేల ఎకరాలకు పైగా రైతులు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో చెరుకు, వరి, పసుపు, పత్తి, కందితో పాటు కూరగాయల పంటలు అధికంగా సాగు చేస్తారు. పసుపు, వామ, చెరుకు పంటలకు అనువైన నేలలు ఉన్నా మార్కెట్ లేక పోవడంతో రైతులు ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. దానికి తోడు ఖరీఫ్‌లో విత్తనాలు నాటే సమయంలో ఆగ్రోస్, క్రిబ్‌కో కేంద్రాలు లేక వ్యాపారులు చెప్పిందే శాసనంగా అధిక ధరలకు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేస్తున్నారు. సుమారు ఐదేళ్ల నుంచి మండల కేంద్రంలో ఆగ్రోస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని అప్పట్లో పలు గ్రామాల సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు మండల సర్వసభ్య సమావేశంలో మొరపెట్టుకున్నారు. విత్తనాలు, ఎరువులు అందుబాటుల్లో లేక దళారులను ఆశ్రయించడంతో పాటు వికారాబాద్, జహీరాబాద్, తాండూరు పట్టణాలకు వెళ్లి తీసుకుంటున్నారు.

అడ్డగోలుగా విక్రయాలు



ఖరీఫ్ ప్రారంభంలోగా ఆగ్రోస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. రైతులకు ఎరువులతో పాటు విత్తనాలు అందుబాటులో ఉంచాలి. కొన్ని గ్రామాల్లో లైసెన్స్‌లు లేకున్నా పత్తి విత్తనాలు, ఎరువులు పంపిణీ చేస్తున్నారు. అయినా ఎవరు పట్టించుకోవడం లేదు.

– వెంకటేశం, రైతు, జనగాం

లైసెన్స్‌లు నిలిపివేయాలి



క్రిమి సంహారక మందుల దుకాణాల యజమానులు ఎరువులు, విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే వారి లైసెన్స్‌లు రద్దు చేయడంతో కఠిన చర్యలు తీసుకోవాలి. ఏటా నాసిరకం మందులు విక్రయించినా ఎవరు పట్టించుకోవడం లేదు.

– శ్రీనివాస్, రైతు, దుగ్గాపూర్

ఉన్నతాధికారులకు నివేదిస్తాం



కొత్త ఆగ్రోస్ కేంద్రం ఏర్పాటు చేయాలని మండల రైతులు కోరుతున్న విషయం వాస్తవమే. ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం. ఎరువుల దుకాణాల ద్వారా ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే ఎక్కువ అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటాం.

– నజీరొద్దిన్, ఏఓ, పెద్దేముల్



సల్లంగ చూడు తల్లీ!

బషీరాబాద్: మండలంలోని నావంద్గీ గ్రామంలో గ్రామదేవత ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి అమ్మవారికి మహిళలు బోనాలతో వచ్చి నైవేద్యాలు సమర్పించారు. గ్రామంలో పంటలు బాగా పండి అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని గ్రామస్తులు వేడుకున్నారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి భారీ మూల్యం

- మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు
- ట్రాఫిక్ ఎస్‌ఐ రవీందర్‌నాయక్



డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టిన ట్రాఫిక్ ఎస్‌ఐ రవీందర్‌నాయక్

కడ్తాల్: రోడ్డు భద్రతా నియమాలు పాటించకుండా, మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని షాద్‌నగర్ ట్రాఫిక్ ఎస్‌ఐ రవీందర్‌నాయక్ హెచ్చరించారు. ఆదివారం మండల కేంద్రంలోని సమీపంలోని టోల్‌ప్లాజ్ వద్ద ట్రాఫిక్ పోలీసు సిబ్బందితో కలిసి ఆయన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 25 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, 10 మందిపై ర్యాష్ డ్రైవింగ్ కేసులు, 81 మందిపై హెల్మెట్ లేని కేసులు, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన 21 మందిపై కేసులు, రాంగ్ రూట్‌లో వాహనాలు నడిపిన ఐదుగురిపై, మైనర్ డ్రైవింగ్ 3 కేసులు కలిపి మొత్తం 145 కేసులు నమోదు చేసినట్లు ట్రాఫిక్ ఎస్‌ఐ తెలిపారు.

వాహనదారులకు కౌన్సెలింగ్

రాంగ్ సైడ్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్, లైసెన్స్, హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపిన వారితో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వారికి ట్రాఫిక్ ఎస్‌ఐ రవీందర్‌నాయక్ కౌన్సెలింగ్ ఇచ్చారు. వాహనాలు నడిపే వ్యక్తి కచ్చితంగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సీట్‌బెల్ట్ ధరించాలని, ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ లేకుండా ప్రయాణించరాదన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టరీత్యా నేరమని, డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికితే శిక్ష తప్పదని హెచ్చరించారు. మైనర్లు వాహనాలు నడిపితే వాహన యాజమానిపై కేసులు నమోదు చేస్తామన్నారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడిపితే విలువైన ప్రాణాలు గాల్లో కలుస్తాయన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వరప్రసాద్, ఏఎస్‌ఐ ప్రసాద్‌జీ, ట్రాఫిక్ పోలీస్ పోలీస్ సిబ్బంది పూలేందర్, రామస్వామి, సంతోష్, రవికాంత్, రవీందర్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, శ్రీరామ్, నరేందర్, వెంకటేశ్ పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు



సీజ్ చేసిన ట్రాక్టర్

కుల్కచర్ల: అక్రమంగా ఇసుక తరలిస్తే ఉపేక్షించేది లేదని ఎస్‌ఐ శ్రీశైలం హెచ్చరించారు. ఆదివారం కుల్కచర్ల మండల పరిధిలోని అంతారం గ్రామ సమీపంలో కావలి శ్రీనివాస్ తన ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు సిబ్బందితో వెళ్లి ఎస్‌ఐ ట్రాక్టర్‌ను స్వాధీన పర్చుకున్నారు. ట్రాక్టర్‌కు సంబంధించిన ఎలాంటి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసి స్టేషనకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ శ్రీశైలం తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

తాండూరు టౌన్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను తాండూరు పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టణ సీఐ సంతోష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం రాత్రి పాత తాండూరు పరిధిలోని కాగ్నా నది నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నారు. ట్రాక్టర్ డ్రైవర్ జుంటిపల్లి రమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

‘ఆయన’ వెనుకడుగే!



దౌల్తాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

- కు.ని చికిత్సకు ముందుకురాని పురుషులు
- ఇబ్బందులు పడుతున్న మహిళలు

దౌల్తాబాద్: కుటుంబ నియంత్రణ చికిత్సలు ఆడవాళ్లకే పరిమితమవుతున్నాయి. అన్నింటా ముందు ఉండాలనుకునే పురుషులు మాత్రం ఈ చికిత్సలు చేయించుకోవడానికి వెనుకడుగు వేస్తున్నారు. భవిష్యత్తులో ఎలాంటి ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తని వెసెక్టమీ ఆపరేషన్లు చేయించుకునేందుకు పురుషులు ముందుకు రావడంలేదు. కు.ని కేవలం మహిళలకే పరిమితం అయ్యాయి.

ప్రోత్సాహకం ఉన్నా...

నానాటికీ పెరుగుతున్న జనాభా వల్ల కలిగే అనార్థాలను గుర్తించిన ప్రభుత్వం దాన్ని నియంత్రించేందుకు పీహెచ్‌సీల్లో, క్లస్టర్ ఆస్పత్రుల్లో కు.ని ఆపరేషన్లు చేస్తుంది. ఏటా వైద్యశాఖకు లక్ష్యాలు నిర్దేశించి వాటిని సాధించేందుకు ప్రోత్సాహకాలను సైతం ఇస్తోంది. అయితే క్షేత్రస్థాయిలో దీనిపై ప్రచారం లేక లక్ష్యాలు నెరవేరడంలేదు. మహిళలు ట్యూబెక్టమీ శస్త్ర చికిత్స చేసుకుంటే రూ.800, పురుషులు వెసెక్టమీ చేయించుకుంటే రూ.1,100 ప్రోత్సాహకంగా ప్రభుత్వం అందిస్తుంది. ఆపరేషన్ చేయించుకునేలా ప్రోత్సహించేందుకు ఆశాలకు ఒక్కో ఆపరేషన్‌కు రూ.200 చొప్పున అందజేస్తున్నారు. కాగా కు.ని ఆపరేషన్ చేయించుకోవడం కోసం పురుషులు ముందుకు రాకపోవడంతో మహిళలపై మళ్లీ భారం పడుతుంది. మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో మొత్తం 9 ఉపకేంద్రాలు ఉన్నాయి. పీహెచ్‌సీలో ప్రతి నెలా సుమారు 20 నుంచి 25 మంది మహిళల డెలివరీలు జరుగుతున్నాయి. డెలివరీలు జరిగి ఆరోగ్య పరంగా కొంత ఇబ్బందులు ఎదుర్కొంటున్నా మహిళలు మళ్లీ కు.ని ఆపరేషన్లు చేయించుకోవడం వల్ల చాలా బలహీనమయ్యే అవకాశం ఉంది. కానీ పురుషుల్లో అలాంటి సమస్య ఉండదు. అయినా కు.ని శస్త్ర చికిత్సలకు మహిళలు ముందుకు వస్తుంటే పురుషులు రాకపోవడం గమనార్హం.

ఇబ్బంది ఉండదు



వెసెక్టమీ చేయించుకుంటే ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఆరోగ్య పరంగా నష్టం జరగదు. పురుషులు నిర్భయంగా శస్త్ర చికిత్సలు చేయించుకోవచ్చు. మహిళలకు భారం తగ్గించాలంటే పురుషుల సహకారం ఎంతో అవసరం. పురుషులు ముందుకు రావాలి.

– రతన్‌లాల్, వైద్యాధికారి, దౌల్తాబాద్

గ్రామస్తుల సహకారం మరువలేనిది



మాజీ సర్పంచ్ స్వప్న, మాజీ వార్డు సభ్యులను సన్మానిస్తున్న గ్రామస్తులు



మొయినాబాద్: పెద్దమంగళారంలో నరోత్తంరెడ్డిని సన్మానిస్తున్న స్నేహితులు

మొయినాబాద్ రూరల్: గ్రామ అభివృద్ధిలో గ్రామస్తుల సహకారం మరువలేనిదని నక్కలపల్లి మాజీ సర్పంచ్ స్వప్నఅంజయ్యగౌడ్ అన్నారు. మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆదివారం మాజీ సర్పంచ్ స్వప్నఅంజయ్యగౌడ్, మాజీ ఉపసర్పంచ్, మాజీ వార్డు సభ్యులను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా స్వప్నఅంజయ్యగౌడ్ మాట్లాడుతూ ఐదు సంవత్సరాల పాటు గ్రామాన్ని అభివృద్ధి చేసుకునేందుకు గ్రామస్తులు కూడా కృషి చేశారని పేర్కొన్నారు. గ్రామంలో పార్టీలకు అతీతంగా ప్రతీ ఒక్కరు సహకరించారన్నారు. గ్రామంలో ముఖ్యంగా సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ, శ్మశానవాటిక ఏర్పాటు చేసినట్లు ఆయన గుర్తు చేశారు.

సర్పంచుల పాత్ర కీలకం

మొయినాబాద్: గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమని మొయినాబాద్ మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కొంపల్లి అనంతరెడ్డి అన్నారు. మండల పరిధిలోని పెద్దమంగళారం సర్పంచుగా ఐదు సంవత్సరాలు దిగ్విజయంగా పూర్తి చేసుకున్న సందర్భంగా కోట్ల నరోత్తంరెడ్డిని ఆదివారం ఆయన స్నేహితులు, వెంకటేశ్వరకాలనీ యువకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు అభివృద్ధిలో సర్పంచులే ముఖ్య భూమిక పోషించారన్నారు. పెద్దమంగళారం సర్పంచుగా నరోత్తంరెడ్డి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. మాజీ సర్పంచ్ నరోత్తంరెడ్డి మాట్లాడుతూ ఐదేళ్ల పాటు గ్రామాభివృద్ధికి సహకరించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండడి వెంకట్‌రెడ్డి, కిసాన్‌సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, స్నేహితులు సత్తిరెడ్డి, సుధాకర్‌గౌడ్, కోట్ల పెంటారెడ్డి, నాగరాజు, తిరుపతిరెడ్డి, నారాయణరెడ్డి, కృష్ణ, ఉపేందర్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి, శ్రీశైలం, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం



ఆర్యవైశ్య మహాసభ సేవాదళ్ అధ్యక్ష కార్యదర్శులు

తాండూరు: ఆర్యవైశ్య మహాసభ సేవాదళ్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. యువజన ఆర్యవైశ్య సేవాదళ్ జిల్లా అధ్యక్షుడిగా తాండూరు పట్టణానికి చెందిన గుబ్బ నరేశ్, ప్రధాన కార్యదర్శిగా కట్కం హరీశ్‌కుమార్ గుప్తా, కోశాధికారిగా పునీత్‌కుమార్‌లు ఎన్నికయ్యారు. ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు నూతన కమిటీ ప్రతినిధులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో పదవులు అప్పగించడం పట్ల ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం సూచనలను పాటిస్తూ ఆర్యవైశ్యుల గౌరవాన్ని మరింత పెంపొందించేలా సమాజంలో కార్యక్రమాలను చేపడతామని అన్నారు.

ఉరేసుకొని మహిళ బలవన్మరణం

షాబాద్: కుటుంబ కలహాలతో ఓ వివాహిత ఉరేసుకొని అనుమానాస్పదస్థితిలో ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాందర్‌ఖాన్‌పేట గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బర్ల నీలమ్మ(40) భర్త, ఇద్దరు పిల్లలతో కలిసి ఉన్నారు. కొంత కాలంగా కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామ పెద్దల సమక్షంలో మాట్లాడుకొని రాజీ అయ్యారు. అయినా కూడా కలహాలు కొనసాగుతూనే ఉన్నాయి. దీంతో నీలమ్మ శనివారం ఇంట్లో ఉరి వేసుకొని అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. మృతురాలి సోదరి శోభ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అదృశ్యంపై కేసు నమోదు



షేక్ కాసీం (ఫైల్)

పహాడీషరీఫ్: భార్యతో గొడవ పడిన ఓ వ్యక్తి ఇంటి నుంచి వెళ్లిపోయిన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. దేవేందర్ నగర్ కాలనీకి చెందిన షేక్ షరీఫా, షేక్ కాసీం(45) దంపతులు. వీరిద్దరికీ రెండో వివాహం జరిగింది. కాగా మూడు నెలల క్రితం భార్యభర్తలు గొడవ పడడంతో అతడు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. రెండు నెలల క్రితం షరీఫా తండ్రికి ఫోన్ చేసిన కసీం 15 రోజుల్లో డబ్బులతో వస్తానని చెప్పాడు. అనంతరం ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. మొదటి భార్య వద్దకు వెళ్లి ఉంటాడని భావించినప్పటికీ, అక్కడ కూడా వెళ్లలేదన్న విషయం తెలుసుకున్న షరీఫా పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.

అవిశ్వాసాల గుబులు!

- రసవత్తరంగా పురపాలికల రాజకీయాలు
- ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల చైర్ పర్సన్లకు పదవీగండం
- పావులు కదుపుతున్న అధికార, ప్రతిపక్ష నేతలు
- జిల్లాలో చర్చనీయాంశంగా మారిన వైనం

ఇబ్రహీంపట్నం: నియోజకవర్గంలోని పురపాలక సంఘాల్లో అవిశ్వాసాల చిచ్చు జోరందుకుంది. గత నెలలో ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల మున్సిపల్ చైర్ పర్సన్లపై, గత ఏడాది పెద్ద అంబర్‌పేట మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టాలని జిల్లా కలెక్టర్లకు అభ్యర్థనలను కౌన్సిలర్లు అందజేశారు. అధికార పార్టీకి చెందిన వారే చైర్ పర్సన్లుగా ఉండటంతో కాంగ్రెస్ అధిష్టానానికి ఈ వ్యవహారం సంకటంగా మారింది. కాంగ్రెస్ చైర్మన్లపై అవిశ్వాసాలకు వెళ్లితే.. పార్టీ క్రమశిక్షణ చర్యలు చేపడుతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి బహిరంగంగా హెచ్చరించిన కౌన్సిలర్లు తగ్గేదేలేదంటున్నారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గం రాజకీయాలు జిల్లాలోనే హాట్ టాపిక్‌గా మారాయి.

అదనుగా భావించి నోటీసులు

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని రెండు మున్సిపాలిటీల చైర్ పర్సన్లపై అవిశ్వాస పరీక్షకు ముహూర్తం ఖరారు కావడంతో రసవత్తరంగా రాజకీయాలు మారుతున్నాయి. ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల చైర్ పర్సన్లు కప్పరి స్రవంతి, కొత్త ఆర్థికగౌడ్‌లు అధికార కాంగ్రెస్ పార్టీలో ఉండటంతో ఒక్కసారిగా పుర రాజకీయాలు వేడెక్కాయి. బీఆర్‌ఎస్ పార్టీ నుంచి కౌన్సిలర్‌గా ఎన్నికైన స్రవంతి అప్పటి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అండతో చైర్ పర్సన్ పదవిని దక్కించుకుంది. కిషన్‌రెడ్డి, కప్పరి స్రవంతిల మధ్య వైషమ్యాలు తలెత్తడంతో ఏడాది క్రితమే దూరం పెరిగింది. అప్పటికే ఆమెపై అలకబూనిన కౌన్సిలర్లు ఇదే అదనుగా భావించి మూడేళ్ల కాలపరిమితి ముగిసిన వెంటనే గత సంవత్సరం అవిశ్వాస నోటీసులు కలెక్టర్‌కు అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు పురపాలక సంఘాలల్లో ఇదే తంతూ కొనసాగింది. ఈ నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికలు ముగియడం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో రాజకీయాలు ఒక్కసారిగా మారాయి. రాష్ట్ర వ్యాప్తంగా తిరిగి అవిశ్వాసల ప్రక్రియ సాగుతోంది.

మారిన రాజకీయ పరిస్థితులు

ఇబ్రహీంపట్నం బీఆర్‌ఎస్ చైర్ పర్సన్ కప్పరి స్రవంతి అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో రాజకీయ పరిస్థితులు మారాయి. రాష్ట్రంలో అధికారంలోకి కాంగ్రెస్ రావడంతో ఆమెకు కొంత బలం చేకూరింది. అప్పట్లో కాంగ్రెస్ నుంచి కౌన్సిలర్‌గా గెలిచిన కొత్త ఆర్థికగౌడ్ అధికార బీఆర్‌ఎస్‌లో చేరి ఆదిబట్ల మున్సిపల్ చైర్ పర్సన్ పదవిని దక్కించుకున్న విషయం విదితమే. ఈ పదవిని ఆశించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ముఖ్య అనుచరుడు, కాంగ్రెస్ కౌన్సిలర్ మర్రి నిరంజన్‌రెడ్డికి అప్పట్లో నిరాశే మిగిలింది. అప్పటి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డితో ఏర్పడిన విభేదాల కారణంగా ఆర్థికగౌడ్ తిరిగి కాంగ్రెస్ గూటికి చేరింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే టికెట్ ఆశించి భంగపడ్డ మర్రి నిరంజన్‌రెడ్డి తిరిగి మున్సిపల్ చైర్మన్ పదవిపై కన్నేశారు. తన రాజకీయ చతురతతో నిరంజన్‌రెడ్డి పావులు కదిపి బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీల కౌన్సిలర్లను తనవైపు తిప్పుకున్నాడు. ఆదిబట్ల మున్సిపాలిటీలోని 15 మంది కౌన్సిలర్లలో 12 మంది గత నెల 5న చైర్‌పర్సన్ కొత్త ఆర్థికగౌడ్, వైస్ చైర్మన్ కొరే కళమ్మలపై అవిశ్వాసం పెట్టాలని నోటీసులను జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. మరోవైపు అధికారపార్టీలో కొనసాగుతున్న పెద్ద అంబర్‌పేట చైర్ పర్సన్ చెవుల స్వప్నపై గతేడాది అవిశ్వాసం పెట్టాలని నోటీసులు ఇచ్చిన కౌన్సిలర్లు ప్రస్తుతం స్తబ్దుగానే ఉన్నారు.



ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయం

అవిశ్వాస నోటీసులు

ఇబ్రహీంపట్నం పురపాలక సంఘ పరిధిలో చైర్ పర్సన్‌తో కలిసి 24 మంది కౌన్సిలర్లు ఉండగా అందులో 17 మంది అవిశ్వాస నోటీసులను గత నెల 8న కలెక్టర్‌కు అందజేశా రు. ఇద్దరు బీజేపీ, ముగ్గురు కాంగ్రెస్ నుంచి ఎన్నికై న కౌన్సిలర్లతోపాటు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు అందులో ఉన్నారు. బీఆర్‌ఎస్ కౌన్సిలర్ కొంద్రు శ్రీలత చైర్ పర్సన్ పదవి ఆశిస్తూ వ్యూహాలకు పదును పెడుతున్నారు.

క్యాంపుల్లోనే కౌన్సిలర్లు

ఆదిబట్ల పురపాలక సంఘంలో ఈ నెల 9న, ఇబ్రహీ ంపట్నం పురపాలక సంఘంలో ఈనెల 16న అవిశ్వా స పరీక్ష పేట్టేందుకు జిల్లా కలెక్టర్ శశాంక ఆదేశా లు జారీ చేశారు. అవిశ్వాసాలు వీగిపోయేందుకు ప్రస్తు త చైర్ పర్సన్స్‌ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో ప్రత్యర్థులకు చిక్కకుండా కౌన్సిలర్లను క్యాంపులకు చైర్మన్ పదవులు ఆశిస్తున్న వారు తరలించారు.

మర్రి నిరంజన్‌రెడ్డిని సస్పెండ్

అవిశ్వాసాలను ఎదుర్కొంటున్న అధికార కాంగ్రెస్ చైర్మన్లు ఇందులో నుంచి గట్టెందుకు అన్నిరకాల వ్యూహారచనలతో ముందుకెళుతున్నారు. ఇందులో భాగంగా ఆదిబట్ల చైర్మన్ స్థానాన్ని ఆశిస్తున్న మర్రి నిరంజన్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ వ్యతిరేక కార్యకాలాపాలకు పాల్పడుతున్నాడని క్రమశిక్షణ సంఘం చైర్మన్ డా చిన్నారెడ్డి సస్పెండ్ వేటు వేశారు. కాంగ్రెస్ కౌన్సిలర్లందరిపై కూడా పార్టీ క్రమశిక్షణ సంఘం చర్యలు తీసుకొనున్నట్లు తెలుస్తోంది.